

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగు దినపత్రిక




ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 17 | ఆదివారం 19, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## మహిళలను మోసం చేయడంలో

# కాంగ్రెస్ ఫస్ట్



- ఇప్పటికే 30 ఏళ్లుగా మోసం చేస్తోంది
- మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం
- నిడదవోలులో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిరసన
- ర్యాలీలో పాల్గొన్న చంద్రబాబు కాంగ్రెస్‌పై ధ్వజం

నిడదవోలు, (ప్రజా సీమ) ఏప్రిల్ 18 : మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇప్పటికే 30 ఏళ్లు కాంగ్రెస్ మోసం చేసిందని, మహిళా రిజర్వేషన్లు ఎప్పుడు అమలవుతాయో ఆ దేవుడికే తెలియాలని వ్యాఖ్యానించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంతో మహిళా రిజర్వేషన్ల అమలు 2034కి వెళ్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి వ్యతిరేకించినందుకు నిరసనగా శనివారం నిడదవోలులో ఎన్డీఏ కూటమి పక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులు నిమ్మల రామ్మోహన్ నాయుడు, క ందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలు సరిగా చేయలేరని కొందరు విమర్శిస్తున్నారని, ఆడబిడ్డలే మగవారికంటే ఎక్కువగా సంపాదిస్తున్నారంటే అది మహిళల శక్తి కాదా అని అన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలకు చేయూతనిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, మిత్రపక్షాలు సహకరిస్తే మహిళా బిల్లు ఆమోదం పొందేది. మహిళా బిల్లును ఎందుకు ఆమోదించలేదో చెప్పాలని విపక్షాలను నిలదీస్తున్నా. 1996లో దేవెగౌడ హయాంలో బిల్లుకు కాంగ్రెస్ మద్దతిచ్చినా వాళ్లు ఒప్పుకోలేదు. ఆ తర్వాత

2లో

## మహిళా బిల్లు పేరుతో

# డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

చెన్నై, (ప్రజా సీమ) ఏప్రిల్ 18 : మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళ నాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళ నాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా



పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని

2లో

## రాజ్యాంగ సవరణ బిల్లు

# వీగిపోవడం ఆనందం



- దేశాన్ని విభజించే కుట్రలను ఆపారు
- వారందరికీ ఎన్నో కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా స్టాలిన్ వెల్లడి

చెన్నై, (ప్రజా సీమ) ఏప్రిల్ 18 : లోక్‌సభలో శుక్రవారం రాజ్యాంగ 131 సవరణ బిల్లు 2026 వీగిపోయింది. దీంతో నల్లచట్టమైన డీలిమిటేషన్‌ని కేంద్రం ఉపసంహరించుకుంది. డీలిమిటషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసిన పోరాటం పార్లమెంటులో విజయం సాధించిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. దానిని ఓడించినందుకు ఇండియా బ్లాక్ ఎంపీలకు, మహిళలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. నేను ఆనందంతో, నూతన శక్తితో మీ ముందు నిలబడ్డాను. డీలిమిటేషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా మన పోరాటం విజయవంతమైంది. ఈ ప్రమాదాన్ని ఏడాది క్రితమే ఊహించి, ఈ విజయాన్ని సాధించడానికి అవసరమైన పనులన్నీ అప్పుడే మొదలుపెట్టాము. మొదట ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకుల సమన్వయ సమావేశంతో మొదలుపెట్టి, మొన్న మేము నల్లజెండా ఎగురవేసి నల్లచట్టం ప్రతిని దహనం చేశాము. అప్పుడు నేను దహనం చేసిన ప్రతిల మంటను వ్యాపించనివ్వండి అని నేను అన్నాను. అదే నిన్న పార్లమెంటులో కూడా మంటలు చెలరేగాయి' అని స్టాలిన్ వీడియోలో అన్నారు. హిళా రిజర్వేషన్ల నెపంతో మోసపూరిత ప్రయత్నాన్ని ప్రతిఘటించిన తమిళనాడు ప్రజలకు, ముఖ్యంగా మహిళలను ఆయన ప్రశంసించారు. అలాగే శుక్రవారం పార్లమెంటులో 50,60 వ దశకాల నాటి పాత డిఎంకెని చూడడం అంటే ఏమిటని

2లో

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం



- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినెట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

న్యూఢిల్లీ, (ప్రజా సీమ) ఏప్రిల్ 18 : మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298–230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని

2లో

# దత్తపుత్రుడి బండారం బయట పడింది

- బిజెపితో అనుబంధం బట్టబయలు
- జగన్ తీరుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

అమరావతి,ఏప్రిల్18 : జగన్ చేసిన నీచపు పనికి వైఎస్సార్ ఆత్మ నిజంగా ఘోషిస్తోందని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. మహిళా బిల్లును, డీ లిమిటేషన్‌కి లింక్ పెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని విమర్శించారు. బీజేపీతో ఆయన పెట్టుకున్న అక్రమపొత్తు తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. విపక్షం ముసుగులో ఉన్నది సైతం బిజెపి పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని తెలిపారు. వైసీపీ



హయాంలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా..? అని ప్రశ్నించారు. కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బతకాలా..? అని ఎద్దేవా చేశారు. ఇదేనా జగన్ చెప్పే వైఎస్సార్ ఆశయాలు, వారసత్వం..? అని నిలదీశారు. మహానేతవైఎస్సార్ సిద్ధాంతాలను

2లో

# రాముడిపై నోరు పారేసుకున్న ప్రకాశ్ రాజ్

- నటుడి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం - మండిపడ్డ జనసేన నేత నాగబాబు

అమరావతి,ఏప్రిల్18 : ఇటీవల కేరళ సాహిత్యోత్సవంలో ప్రకాశ్ రాజ్ రామాయణం గురించి చేసిన వ్యాఖ్యలు చినికి చినికి గాలివానగా మారుతున్నాయి. రాముడు ఉత్తరాది కూలీ అని, దక్షిణాదికి వలస వచ్చాడని దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పలు ప్రాంతాలలో ఆయనపై రామభక్తులు కేసులు వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి సైతం ప్రకాశ్ రాజ్‌పై పరువునష్టం దావా వేసి, లీగల్ నోటీసులు పంపారు. ఆయన సహ నటీనటులు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. మరికొందరైతే ప్రకాశ్‌రాజ్ నటిస్తున్న సినిమాలను బాయ్‌కాట్ చేయాలని పిలుపు నిస్తున్నారు. ప్రకాశ్ రాజ్‌ను సినిమాల నుండి తొలగించాలని సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత, జనసేన శాసనమండలి సభ్యులు నాగబాబు సైతం ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. ట్విట్టర్ వేదికగా ఆయన తన మనసులోని భావాలను వ్యక్తం చేశారు. 'శ్రీరాముడు కేవలం హిందువుల దేవుడు మాత్రమే కాదు. ఆయన ధర్మానికి ప్రతీక. ఆయనను అవమానించడం లేదా తగ్గించాలని చూడటం ధైర్యం కాదు... అహంకారం! మానసిక అంధత్వం వల్ల జరిగే పొరపాటు అది' అని అన్నారు.

నేటిపత్రిక ప్రజాసీమ
PRGI Regd. No : APTEL/26/A0819
జాతీయ తెలుగు దినపత్రిక



# సంపాదకీయం

## విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ !

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్యాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# దత్తపుత్రుడి బండారం బయట పడింది

మంట గలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు ఎవరు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మహిళలకు అగ్రతాంబూలం అందిస్తుంటే అభ్యంతరం ఎవరికీ లేదని అన్నారు. కాంగ్రెస్‌తో సహా దేశవ్యాప్తంగా విపక్షాల ఐక్యత ఒకటేనని చెప్పుకొచ్చారు. మహిళా బిల్లు పాస్ అయ్యింది 2023లోనేనని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజనపై, మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ స్టాండ్ క్లియర్‌గా ఉందని వ్యాఖ్యానించారు. 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలని షర్మిల సూచించారు. కులగణన ద్వారా ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీల సంఖ్య తేలాలని అన్నారు. కులాల ఆధారంగా డీ లిమిటేషన్‌లో రిజర్వేషన్లు పాటించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుత 543 స్థానాలకు తక్షణం మహిళా రిజర్వేషన్లను పాటించాలని సూచించారు. చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని సమ్మతమైన పరిష్కారం చూపాలని అన్నారు. అధికారిక గణాంకాలు లేకుండా 50 శాతం పెంచి? దేశాన్ని అభివృద్ధి చేస్తున్నామని బీజేపీ చెబితే గుడ్డిగా జగన్ సైతం నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు.

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఆనందం

అడుగున్న కొంతమంది అపరిపక్వ వ్యక్తులతో 'ఇదే డిఎంకె' చూడండి' అని నేను చెప్పాను. నిన్న మేమ దాన్ని బలంగా చూపించాం అని స్టాలిన్ వీడియో సందేశంలో అన్నారు. పార్లమెంటులో దీనిని ఓడించిన ప్రతి ఒక్కరికీ తాను కతృతజ్ఞతలు తెలిపారు. ఇండియా బ్లాక్ పార్టీలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఏకతాటిపై నిలబడటం వల్లే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. దేశాన్ని విభజించే ప్రయత్నాల కు ఇది భారీ దెబ్బ అని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రతిపక్ష పార్టీల మధ్య పెరుగుతున్న ఐక్యతను ప్రదర్శిస్తోందని ఆయన తెలిపారు. ఇది మోడీ ప్రభుత్వానికి ఆరంభం మాత్రమే. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 12 ఏళ్లలో తొలిసారిగా పార్లమెంటులో వీగిపోయిందని ఆయన ఎత్తిచూపారు. ప్రతిపక్ష పార్టీల సభ్యులకు ఈ సందర్భం స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ఫస్ట్

నాలుగుసార్లు బిల్లు వచ్చినా ఆమోదం పొందకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. యూపీఏ హయాంలో రాజ్యసభలో బిల్లు ఆమోదించారు. రాజ్యసభలో భాజపా సమర్థించింది.. మరి అప్పుడు లోక్‌సభలో ఎందుకు తీసుకురాలేదు. అప్పుడే లోక్‌సభలో తీసుకువచ్చి ఉంటే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కే దక్కేది కదా అని ఆన్నారు. 2023లో మహిళా బిల్లు వచ్చినా.. 2026లో జనగణన జరగాల్సి ఉంది. జనగణన, డీలిమిటేషన్ తర్వాత మహిళా బిల్లుపై ముందుకెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. వాజ్‌పేయి హయాంలో 1971 జనాభా లెక్కల ప్రకారం ముందుకెళ్లారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మహిళలకు రిజర్వేషన్లు దక్కకుండా చేశారు. ఇది దేశద్రోహం.. మహిళలకు చేసిన దగా, మోసమని హెచ్చరిస్తున్నా అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతలో ఏపీ ముందంజలో ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే కాంగ్రెస్ అడ్డుపడిందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి దేశవ్యాప్త నిరసన నిడదవోలు నుంచి మొదలైందని తెలిపారు. నిడదవోలు పర్యటన చరిత్రలో నిలిచిపోతుందని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో తీసుకువచ్చారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ఈ బిల్లు అమల్లోకి రావాలంటే, 2026లో జనగణన జరగాల్సి ఉందని తెలిపారు. అలాంటి బిల్లుకు ఇండియా కూటమి నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేదని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో నష్టం జరుగుతోందని ఇండియా కూటమి నేతలు అంటున్నారని.. ఈ విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పారని తెలిపారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తనకు బాధ వేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, సమాన ఆస్తి హక్కును దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు కల్పించారని ఉద్ఘాటించారు. ఏపీ డ్వాక్రా మహిళలు దేశ వ్యాప్తంగా నెంబర్ వన్‌గా పనిచేస్తున్నారని ప్రశంసించారు. వరకట్న సమస్య పోయిందని చెప్పుకొచ్చారు. ఆడబిడ్డలే భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్నారంటే, అది ఆడబిడ్డల శక్తి అని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అనుకుని ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో పాసయ్యేదని.. కానీ ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఈ నాటిది కాదని చెప్పుకొచ్చారు. మహిళలకు ఎప్పుడు న్యాయం చేయని పార్టీ, ద్రోహం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. మహిళలకు రిజర్వేషన్లు వచ్చేవరకు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.




# బెల్ట్ షాపులు పై పోలీసుల దాడులు

రాజంపేట (ప్రజా సీమ): శనివారం రాజంపేటలో బెల్ట్ షాపులపై టౌన్ ఎస్సై వెంకటేశ్ మరియు అతని సిబ్బంది దాడులలో టిటిడి ఫంక్షన్ హాల్ సమీపంలో బైపాస్ రోడ్డు వద్ద ముకుందరగడ్డ లక్ష్మణ్ నాయక్ అనే వ్యక్తి అరెస్టు చేసి అతని వద్ద నుండి 13 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు. రాజంపేట పట్టణ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

# దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లు సమావేశం



## స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు

సిద్ధవటం (ప్రజా సీమ ): రాష్ట్ర నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగూరు మీరా గారి ఆధ్వర్యంలో కార్పొరేషన్ సమావేశం విజయవాడలో నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూర్ భాషా దూదేకుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ విధి విధానాలపై చర్చించడం జరిగిందని అధికారులతో మమేకమై కార్పొరేషన్ లో తీసుకోవాల్సిన అంశాలపై విజయవాడలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించడం జరిగిందని డాక్టర్ వీరభద్రుడు తెలిపారు

# ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు


**- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**- డాక్టర్ ఎస్ఎఫ్ బాషా**




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: స్థానిక బాషా హాస్పిటల్ నందు ప్రతి ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా వెల్లడించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డా.సుఫియా, ఉచిత కంటి పరిక్షలతో పాటు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డాక్టర్ అందుబాటులో ఉండనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కంటి శుక్లాల సమస్యలపై ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేయనున్నట్లు ఆయన అన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక బాషా హాస్పిటల్ సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# మద్యం షాపులను తనిఖీ చేసిన ఎక్సైజ్ సీఐ



సిద్ధవటం (ప్రజా సీమ ) :జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సిద్ధవటం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలలో విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయి ప్రభుత్వశీ ఇటీవల ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం స్టాక్ వివరాలను తనిఖీ చేశామని ఎక్సైజ్ రాజశేఖర్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# దలవాయిపల్లిలో స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: పుల్లంపేట మండలంలోని దలవాయిపల్లి గ్రామ పంచాయతీలో స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర (సాూాూా) కార్యక్రమం గ్రామ ప్రజలందరితో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించి పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం అధికారులు నిర్వహించారు .కార్యక్రమంలో భాగంగా కొమ్మనవారిపల్లి చెరువు ఫీడర్ కాలువను శుభ్రపరిచే పనులు చేపట్టారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాలు క్షీణిస్తున్న నేపథ్యంలో నీటి వనరుల పరిరక్షణ అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, చెరువులు మరియు వాటి ఫీడర్ కాలువలను శుభ్రంగా ఉంచడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు, గ్రామస్తులకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రజల సహకారంతోనే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, డిప్యూటీ ఎంపీడీవో సి. శ్రీనివాసులు, ఏపీఓ శ్రీనివాసులు, ఏపీఎం సుబ్బలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుభాష్ మరియు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ హరి కార్మికులు పాల్గొన్నారు.

# టిడిపి పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నాగూర్ మీరా కు శుభాకాంక్షలు

## స్టేట్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు



సిద్ధవటం (ప్రజా సీమ ): తెలుగుదేశం పార్టీ నూతన రాష్ట్ర కమిటీ లో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా నాగూరు మీరా ను ఎంపిక చేశారు నాగూర్ మీరా గారు ఏపీ స్టేట్ నూర్ భాషా అండ్ దూదేకుల కార్పొరేషన్ ఫైనాన్స్ చైర్మన్ గా ఉన్నారు నాగూర్ మీరా గారిని విజయవాడలో కలిసి రాష్ట్ర డైరెక్టర్లు సన్మానం చేశారు ఈ సందర్భంగా స్టేట్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు మాట్లాడుతూ నాగూర్ మీరా గారిని రాష్ట్ర కమిటీలకు ఎన్నికైన సందర్భంగా విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువా తో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు నాగూర్ మీరా గారు ఇలాంటి పదవులు మరెన్నో పొందాలని వారు కొని ఆడారు

# ఎలిమెంటరీ స్కూల్‌లో ఘనంగా వీడ్కోలు సభ




సిద్ధవటం (ప్రజా సీమ ): మండలంలోని మాధవరం -1 పంచాయతీ పరిధి పార్వతీపురంలోని ఎస్.పి.బి.వి.డి సభా ఎలిమెంటరీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్ధవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర హాజరై విద్యార్థులకు సనాతన ధర్మం, భగవద్గీత పఠనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ఐదవ తరగతి విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు.కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు.అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఎం.డి.మధుసూదన్ మాట్లాడుతూ,విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.గురువుల మార్గదర్శకత్వాన్ని ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, క్రమశిక్షణతో చదివి మంచి భవిష్యత్తు సాధించాలని అన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆశీర్వదించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ పాఠశాల కరస్పాండెంట్ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉచితంగా విద్యను అందించడం అభినందనీయమన్నారు.చివరగా విద్యార్థులకు స్మారక చిహ్నాలు అందజేసి,శుభాకాంక్షలతో కార్యక్రమాన్ని ముగించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రమాదేవి ఉపాధ్యాయులు శైలజ,అమరావతి తదితరులు పాల్గొన్నారు.

# నేడు19న భాకరాపేట లో నడివీధి గంగమ్మ తల్లి జాతర


సిద్ధవటం ( ప్రజా సీమ) :సిద్ధవటం మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ భాకరాపేట గ్రామంలో ఆదివారము అనగా 19-04-2026 తేదీన ఉదయం భాకరాపేట మూడు రోడ్ల కూడలి నందు వెలసిన గ్రామ దేవత నడి వీధి గంగమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా భాకరాపేట నడివీధి గంగమ్మ తల్లి జాతర జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు .ప్రతి ఒక్కరు జాతరలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరిన కోరికలు తీర్చే తల్లి భాకరాపేట నడివీధి గంగమ్మ తల్లిని వారు తెలిపారు




# జాతీయ స్థాయిలో మెరిసిన డాక్టర్ సాయి శ్రీ హర్షిత

## - కడప గడప నుండి ఢిల్లీ దాకా









సిద్ధవటం ( ప్రజా సీమ) :కడప/ న్యూఢిల్లీ: కడప జిల్లాకు చెందిన తెలుగు తేజం, డాక్టర్ సాయి శ్రీ హర్షిత జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొంది అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మకమైన 'విజ్ఞాన్ భవన్'లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు కేంద్ర మంత్రులు విశిష్ట అవార్డును ప్రదానం చేశారు.

**విద్యా ప్రస్థానం - అప్రతిహత విజయం**

చిన్న వయస్సు నుండే చదువులో రాణిస్తున్న శ్రీ హర్షిత, పదవ తరగతిలో 90.5%, ఇంటర్మీడియట్ (దీఖ్రా.జ)లో 95% మార్కులతో ప్రతిభ చాటారు. తన తాతగారైన డా. సుబ్రహ్మణ్యం , మరియు తల్లిదండ్రులు, శ్రీ రామకృష్ణ, శ్రీమతి మంజుల గార్ల స్ఫూర్తితో వైద్య రంగంలోకి ప్రవేశించిన ఆమె, ధార్వాడలోని డా. బి.డి. జట్టి హోమియోపతి వైద్య కళాశాలలో ఎనిమిది విభాగాల్లో విశ్వవిద్యాలయ టాపర్‌గా నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. అనంతరం హైదరాబాద్‌లోని జిమ్స్ హోమియో వైద్య కళాశాలలో యం.డి. పూర్తి చేసి, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నారు.

**పరిశోధన రంగంలో విశేష గుర్తింపు**

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి (జజ=ఎ) ద్వారా 2025 సంవత్సరానికి గాను, దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన టాప్ 30 యం.డి. డెజర్టేషన్ అవార్డులలో చోటు సంపాదించి తన మేధస్సును చాటుకున్నారు. ఆమె 'పైలాంథస్ నిరురి' అనే ఔషధ మొక్కపై చేసిన పరిశోధన మరియు మోనోగ్రాఫ్ హోమియోపతి ఫార్మకోపియాలో చోటు దక్కించుకోవడం విశేషం.

**బహుముఖ ప్రజ్ఞాశాలి**

వైద్య రంగమే కాకుండా, డాక్టర్ సాయి శ్రీ హర్షిత ఇతర రంగాలలో కూడా తన ప్రతిభను నిరూపించుకున్నారు: సైకాలజీ: బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎస్సీ సైకాలజీలో అత్యధిక మార్కులతో పీజీ పూర్తి చేశారు.

సంగీతం: కర్ణాటక సంగీతంలో శిక్షణ పొంది జిల్లా స్థాయి పోటీలలో ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు.రికార్డులు: కేంద్ర ఆరోగ్య శాఖ నిర్వహించిన కోర్సులో పాల్గొని 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్' సాధించడంలో తన వంతు భాగస్వామ్యం అందించారు.

**భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి**

ఆమె ప్రతిభను గుర్తించిన జిమ్స్ హోమియో వైద్య కళాశాల యాజమాన్యం, ఆమెకు యం.డి. పూర్తయిన వెంటనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఆమె తన జ్ఞానాన్ని తోటి విద్యార్థులకు పంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కడప మట్టిలో పుట్టి, జాతీయ వేదికలపై తెలుగు వారి కీర్తిని చాటుతున్న డాక్టర్ సాయి శ్రీ హర్షిత మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డికి ఘనంగా సన్మానం







సిద్ధవటం ( ప్రజా సీమ) : టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి కి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు ఘనంగా సన్మానించారు అనంతరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సిద్ధవటం సొసైటీ బ్యాంకు నుండి శనివారం మోహన్ రెడ్డిని ర్యాలీగా బయలుదేరి బాణాసంచాలు కాలుస్తూ పూలు చల్లుకుంటూ సిద్ధవటం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించి ఇంచార్జ్ కార్యకర్తలతో సమావేశమై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ప్రతి గ్రామంలో తెలుగుదేశం జెండా ఎగరవేయాలని నాయకులకు కార్యకర్తలకు తెలియజేశారు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేయాలని కార్యకర్తల సమావేశంలో ఇన్చార్జి దిశా నిర్దేశం చేశారు అనంతరం ఇంచార్జి జగన్మోహన్ రాజు శనివారపు మోహన్ రెడ్డికి ఘనంగా సత్కరించి స్వీట్లు పంచడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త ను పార్టీ ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుందని ఉదాహరణకు నేనేనని గ్రామస్థాయి నుండి మండల స్థాయికి మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయికి పార్టీ నన్ను ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని ఇలాగే మండలంలో పనిచేసే ప్రతి కార్యకర్తను మంచి పార్టీ పదవులు ఇచ్చి ఆదుకుంటుందని ఆయన అన్నారు కార్యకర్తలకు ఏ సమస్యలు వచ్చినా మీకు నేను అందుబాటులో ఉంటానని ఆయన తెలియజేశారు అనంతరం మండల నాయకులు గజమాలతో సత్కరించి సాల్వాలు కప్పి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు, సింగల్ విండో అధ్యక్షులు, దారపునేని దశరథ రామానాయుడు, శ్రీ నిత్య పూజ స్వామి దేవస్థానం చైర్మన్, జింగిటి రాజేంద్రప్రసాద్ యాదవ్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి, వీరనాల రామచంద్ర, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి కాడే శ్రీనివాసులు నాయుడు, నందలూరు సింగిల్ విండో చైర్మన్, ప్రవీణ్, వేణుగోపాలు, ఉప్పరపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు, పుతా బాబు, రాజంపేట నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు, కాడే చెంచయ్య నాయుడు, లింగంపల్లి వెంకటేశ్వర్లు, ఎక్స్ ఎంపీపీ, నరసింహారెడ్డి, మాజీ మండల కన్వీనర్, మామిడి సుబ్బారెడ్డి, టిడిపి యువ నాయకులు, తురా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి, మాధవరం హరిప్రసాద్, కడపాయ పల్లె, పాలకొండ యాదవ్, రమణ యాదవ్, మల్లికార్జున్ రెడ్డి, నియోజవర్గ మహిళా లీడర్, కోటపాటి సుబ్బమ్మ, సిద్ధవటం మండలం మహిళా నాయకురాలు, కమల్ బి, మాధవరం మురళి రాయల్, బోగిడివారిపల్లె, మహేశ్వర్ రెడ్డి, మచుపల్లె, పిచ్చి రెడ్డి, శేఖర్ రెడ్డి, జ్యోతి సునీల్ కుమార్ రెడ్డి, మామిడి రమణారెడ్డి, తదితరులు టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# శ్రీ భువనగిరి లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు చమర్తికి ఆహ్వానం





రాజంపేట (ప్రజా సీమ) : నేడు రాజంపేట పట్టణంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ని శ్రీ భువనగిరి లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 29/04/2026 నుండి 03/05/2026 జరగనున్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను చమర్తి జగన్ మోహన్ రాజు కి అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ,అలయ ధర్మకర్తలు మన్నేరు లక్ష్మీనరసయ్య (మాజీ సర్పంచ్) పూల హరిప్రసాద్, కావేరి గారి వెంకటరమణ,నామాల రాజశేఖర్, కంబయ్య గారి సుబ్బ నరసింహులు,కొమ్మూరు సుబ్బ నరసయ్య,పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జలధారతో నీటి భద్రత - స్వచ్ఛ ఆంధ్రతో శుభ్రత

**- పారిశుద్ధ్య రహిత పట్టణంగా మదనపల్లెని రూపొందించాలి**

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,శాసనసభ్యులు షాజహాన్ బాషా**






మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె పట్టణంలోని గొల్లపల్లిరోడ్ కోమటివాని చెరువు ఆర్చ్ వద్ద శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.నీటి సంరక్షణే సుస్థిర ఆంధ్రకు మార్గం అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,శాసనసభ్యులు షాజహాన్ బాషాతోపాటు ప్రజాప్రతినిధులు,జిల్లా అధికారులు,మున్సిపల్ వార్డు సచివాలయ సిబ్బంది,మెప్మా సంఘాల మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న జలధార కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జలధార జలహారతి పేరుతో అమలు చేయాలని నిర్ణయించడం గర్వకారణమన్నారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించగలిగిన ఈ కార్యక్రమం ద్వారా గత ఆరు నెలల్లోనే సుమారు 38 టీఎంసీల నీటిని భూగర్భంలో నిలువ చేయగలిగామని తెలిపారు.మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో గత సంవత్సరంతో పోలిస్తే 11 టీఎంసీల నీరు అదనంగా అందుబాటులోకి వచ్చిందన్నారు.జిల్లాలో నీటి కొరత ప్రధాన సమస్యగా ఉండేదని,ఇప్పుడు ఏప్రిల్ నెలలో కూడా నీరు లభ్యమవు తుండటంతో వ్యవసాయం,ఉద్యాన పంటలు విస్తృతంగా సాగుతున్నాయని తెలిపారు.నీరు ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.జిల్లాలోని 3789 చెరువులను శుభ్రపరచి,వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.చెరువులను పరిశుభ్రంగా ఉంచితే అవి ఆస్తులుగా మారుతాయని,సిటీ ఆఫ్ లేక్స్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ నీటి వనరులను కాపాడే సంకల్పంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రజలు ఉద్యమంగా తీసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.జలధార జలహారతి ద్వారా నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.కోమటివాని చెరువు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి,ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.మదనపల్లె అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని,రోడ్ల అభివృద్ధి,కాలువలు,బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ఇందులో భాగంగా మానవహారం నిర్వహించి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.పొడి చెత్త,తడి చెత్త,హానికర వ్యర్థాలపై అవగాహన కల్పించే స్టిక్కర్లను కలెక్టర్,ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ వార్డు సచివాలయ సిబ్బంది,మెప్మా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# థియేటర్ల యాజమాన్యాల దోపిడీని అరికట్టాలి

**- బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్**



మదనపల్లె (ప్రజా సీమ) : జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలోని సినిమా థియేటర్ల యాజమాన్యాలు సామాన్య ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయని,ఎమ్.ఆర్.పి ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం అన్నమయ్య జిల్లా ఆహార భద్రతా అధికారికి సంఘం తరపున ఫిర్యాదు అందజేశారు.?ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ బయట మార్కెట్‌లో రూ. 20 ఉండే కూల్ డ్రింక్ బాటిల్‌ను థియేటర్లలో రూ.70 నుండి రూ.80 వరకు విక్రయిస్తూ సామాన్య ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారు.ఇది స్పష్టంగా ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన అన్నారు.పాప్‌కార్న్,పఫ్స్ వంటి పదార్థాలను నాణ్యత లేకుండా తయారు చేస్తూ అసలు ధర కంటే 3-4 రెట్లు అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు.పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది,గత కొంతకాలంగా అధికారుల తనిఖీలు లేకపోవడం వల్ల థియేటర్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి,వెంటనే మదనపల్లిలోని అన్ని థియేటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.ఎమ్.ఆర్.పి కంటే ఎక్కువ ధరలకు విక్రయించే వారిపై భారీ జరిమానాలు విధించి,లైసెన్సులను రద్దు చేయాలన్నారు.?సినిమాకు వచ్చే మధ్యతరగతి,పేద ప్రజలను ఈ దోపిడీ నుండి రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు.తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే బహుజన యువసేన ఆధ్వర్యంలో థియేటర్ల వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని పునీత్ కుమార్ హెచ్చరించారు.

# బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించే స్కౌట్ అండ్ గైడ్స్




రాజంపేట (ప్రజా సీమ): యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, మరియు బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడంలో స్కౌట్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధానోపాధ్యాయులు కే. భారతి అన్నారు. రాజంపేట మండలం కొత్త బోయినపల్లి పీఎం శ్రీ ఎస్ జె ఎస్ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కౌట్ అండ్ గైడ్స్ ప్రథమ సోపానం సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ ప్రథమ సోపానం సర్టిఫికెట్స్ విద్యా ఉద్యోగాల మెరిట్ కు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ గైడ్ పుత్త జనార్ధన్ మాట్లాడుతూ క్యాంపింగ్, హైకింగ్, సామాజిక సేవ, మరియు పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలలో పాల్గొనడం, లైఫ్ స్కిల్స్, టీమ్‌వర్క్, మరియు కష్ట సమయాల్లో ధైర్యంగా ఉండటం స్కౌట్ మూలంగా నేర్చుకుంటారన్నారు. సమాజ అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలు మరియు ఆరోగ్య అవగాహన సదస్సులలో చురుకుగా పాల్గొంటారనీ తెలిపారు. ఇంకా ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు మొలక ఓబులేసు, శేషగిరి,రాజయ్య,పారా శ్రీరాములు, ఎస్వీ.రామరాజు, శివ ప్రసాద్ గౌడ్,ఎస్. ప్రభాకర్ రావు,విజయ భాస్కర్,అనిల్,చెన్న కేశవులు, సువర్ణ సుందరి,అమరావతి,మధు వాణి, ప్రణవి,దార్ల శ్రీనివాసులు ఆచారి, ప్రశాంత్, మేడా సాయి నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే వ్యవసాయానికి పూర్వవైభవం

**- దళారి వ్యవస్థతో తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు**

**- ఏపీ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ సింగం రామకృష్ణా రెడ్డి వెల్లడి**





మదనపల్లె (ప్రజా సీమ) : దళారి వ్యవస్థతో వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన వరి రైతులు,ఉపాధి హామీ కూలీలతో మమేకమై వారి సాధక,బాధలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సింగం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏపీసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నామని అందులో భాగంగానే నెల్లూరు జిల్లా,రాపూరు మండలం,తెగచర్లలో పర్యటించడం జరిగిందన్నారు. ఇక్కడ వరి రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు సరైన ధరలేకపోవడంతో పెట్టుబడి సైతం రావడం లేదన్నారు.ఇక్కడ 860 కేజీలు ఒక పుట్టిగా కొలమానం చేస్తారన్నారు.ఒక పుట్టి ధర ప్రస్తుతం రూ.18,500 పలుకుతోందని,పుట్టిలో 5 కేజీలు తరుగు కింద వ్యాపారులు తీసేస్తారని,పుట్టి వడ్లకు రూ.25 వేలు లభిస్తే మేలు జరుగుతుందని రైతులు వెల్లడించారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దళారీ వ్యవస్థను నిర్మూలించి పుట్టెడ వడ్లను రూ.25 వేలతో రైతుల నుండి నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఒక్క వరి పంటకే కాకుండా రాష్ట్రంలో రైతుల పండిస్తున్న అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు దళారీ వ్యవస్థను నిర్మూలించి అన్నదాతల ఆదుకోవాలన్నారు.అదేవిధంగా ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని,వేసవిని దృష్టిలో ఉంచుకొని పనులు చేసే చోట కూలీలకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని,సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ఎంతో అద్భుతంగా అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.రాహుల్ గాంధీ ప్రధాని,షర్మిల ముఖ్యమంత్రి కావడం,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్నదాతలకు మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకోవడం బాధాకరం

**- ఇండియా కూటమి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి**

**- తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం ఫర్వీన్ తాజ్**



మదనపల్లె (ప్రజా సీమ) : కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షాలు మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం ఫర్వీన్ తాజ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ జాతీయ మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నామని,పోరాడి మహిళలకు రిజర్వేషన్లు సాధించుకునే సమయంలో కాంగ్రెస్,మిత్రపక్షాలు మహిళా బిల్లును అడ్డుకోవడం మహిళలకు ద్రోహం చేయడమేనన్నారు.మహిళలను గౌరవించి అన్నిరంగాలలో ఆదరించడం సంస్కృతి అని,నేడు సంస్కృతి సాంప్రదాయాలకు భిన్నంగా కాంగ్రెస్ మిత్రపక్షాలు మహిళా బిల్లును అడ్డుకోవడం శోచనీయమన్నారు.విపక్షాల ద్రోహాన్ని ప్రతి మహిళ గమనించాలని,మహిళా సాధికారత కోసం అడ్డంకులు సృష్టించకూడదని ఆనాడే ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 2017లో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే కేంద్రం కూడా 2023లో లోక్ సభలో ఆమోదింపబడి మరిన్ని కూడా లోక్ సభలో ఆమోదింపబడిన మహిళా బిల్లును డి లిమిటేషన్ బిల్లుకు,రాజ్యాంగ సవరణ బిల్లుకు ముడిపెట్టి మహిళా రిజర్వేషన్లకు తూట్లు పొడవడమేనన్నారు.ద్రోహం చేసిన కాంగ్రెస్ మిత్రపక్షాలు మహిళలకు క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ

# బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

**- జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం పిలుపు**





మదనపల్లె (ప్రజా సీమ) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచేందుకుగాను పాఠశాల విద్యాశాఖ ప్రవేశపెట్టిన బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి వివేకానంద మున్సిపల్ పాఠశాల ఆధ్వర్యంలో పురవీధులలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ 2026 - 27 విద్యా సంవత్సరానికి గాను అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు ఈనెల 17వ తేదీ శుక్రవారం నుండి ఈ 23వ తేదీ వరకు నిర్వహించబడతాయని, ఈనెల 23వ తేదీ నాటికి ప్రవేశాలు పూర్తి చేయాలని తెలిపారు.ఉపాధ్యాయులు తల్లిదండ్రులు స్థానికుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలలో నిర్వహించాలని, స్థానికంగా ఉన్న అధికారులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని,అలాగే అంగన్వాడి కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తయిన పిల్లల్ని ప్రాథమిక పాఠశాలల్లోనూ,ప్రాథమిక పాఠశాలల్లో ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తెలిపారు ఈ కార్యక్రమం నిర్వహణకుగాను పాఠశాల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని,ప్రభుత్వ పాఠశాలలో లభించు ప్రయోజనాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మదనపల్లి ఉప విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి,అలెస్కో అధికారి వెంకటరమణ,మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్ రెడ్డి,రాజగోపాల్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర,ఉపాధ్యాయ సంఘ నాయకులు పోకల మధుసూదన,పురం వెంకటరమణ,శ్రీనివాసులు,హర్షవర్ధన్,పాఠశాల ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైభవంగా మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు

**- హాజరైన ఎమ్మెల్యే షాజహాన్ బాషా,డీఎస్పీ పావని**

**- అతిథులకు స్వాగతం పలికిన ప్రిన్సిపల్ వై.వనజ**








మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 42వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి.కళాశాల ప్రిన్సిపల్ ఎరికపాటి వనజ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు మదనపల్లి శాసనసభ్యులు ఎం.షాజహాన్ బాషా,డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.పావనిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఉన్న ఏకైక మహిళా డిగ్రీ కళాశాల ఇదేనని,దాని అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థినిలు శ్రద్ధగా చదువి అత్యుత్తమ,ఫలితాలు సాధించాలని తద్వారా కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం డి.ఎస్.పి బి.పావని మాట్లాడుతూ వైఫల్యాలు జీవితంలో సహజమని,వాటి వల్ల నిరుత్సాహపడకుండా మరింత కృషితో ముందుకు సాగాలని విద్యార్థినులకు ప్రోత్సాహం అందించారు.క్రమశిక్షణ,పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.అందివచ్చిన అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు.చివరిగా ప్రిన్సిపల్ వనజ మాట్లాడుతూ 42 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన మహిళా డిగ్రీ కళాశాలకు తాను ప్రిన్సిపల్ గా వ్యవహరించడం గర్వంగా ఉందన్నారు.విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధనతోపాటు సామాజిక స్పృహ,దేశభక్తి,క్రీడలు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు.అధ్యాపకులు చెప్పే పాఠాలు చక్కగా అవగాహన చేసుకుని,తల్లిదండ్రుల సలహాలు పాటిస్తే భవిష్యత్తు బంగారుమయమవుతుందన్నారు.ఇందులో భాగంగా విద్యార్థినులచే ప్రదర్శించబడిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు.అదేవిధంగా ఫైనల్ ఇయర్ విద్యార్థినులకు వీడ్కోలు (ఫేర్వెల్) కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థినులు,సి.పి.డి.సి సభ్యులు,గోపకేశ్వర్,ధాత్రి ఫౌండేషన్ స్థాపకురాలు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- నందలూరు చెరువు నందు శ్రమదానం చేసి వ్యర్థాలను తొలగించిన - చమర్తి**

**- ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకునేందుకే 'జల భద్రత '**

**- తెదేపా నియోజకవర్గఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గారు.**






నందలూరు,(ప్రజా సీమ):ప్రతి వర్షం నీటి బొట్టును సంరక్షించు కుంటేనే జల భద్రత లభిస్తుందని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. శనివారం నందలూరులో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో నందలూరు కన్యకచెరువు వద్ద రైతులతో కలిసి మాట్లాడారు.మన ఊరిని మనమే బాగుపరచుకోవాలని చమర్తి జగన్ మోహన్ రాజుసూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ పూర్తి అవుతున్న నందలూరు చెరువులో నీరు ఉన్నాయంటే ముందు జాగ్రత్తలు తీసుకోవడమేనన్నారు.గత ఏడాది చివర్లో వర్షం నీటిని నిలవలను ఇరిగేషన్ శాఖ అధికారులు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుల సహకారంతో చెరువు నిండిందన్నారు. దీనివల్ల 400 ఎకరాల భూములు సస్యశ్యామలం కావడమే కాకుండా ఈ జోన్ లో ప్రభుత్వానికి 150 కోట్ల ఆదాయం భూగర్భజల పెరగడం ద్వారా వచ్చిందన్నారు. భూగర్భ జలాలుపైనే ఉంటే విద్యుత్ ఆలవుతుందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న సీజన్ దృష్టిలో ఉంచుకొని 100 రోజుల కార్యక్రమాన్ని జల భద్రత పేరుతో చేపట్టారని,ప్రతి రైతు ఇందులో పాల్గొని తమ వంతు శ్రద్ధ తీసుకోవాలన్నారు.ఉపాధి హామీ పథకం ద్వారా జలవంద్రుల అభివృద్ధికి సాధ్యమవుతుందన్నారు.ఉపాధి నిధులను జలసంరక్షణకు లింక్ చేస్తామన్నారు.అనంతరం చమర్తి ప్రజలు,రైతులతో జలభద్రతపై, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, పంచాయతీ రాజ్ , రెవెన్యూ, ఉపాధి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, చెరువు సంఘం చైర్మన్,తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బి.జే.పీ.పార్టీ మండలాధ్యక్షురాలికి ఘన సన్మానం



ఏప్రిల్ 18(ముదినేపల్లి):బి.జే.పిపార్టీ కైకలూరు నియోజక వర్గ ఏం.ఎల్.ఏ. కామినేని శ్రీనివాస్ అనుమతితో ఏలూరు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ ప్రొద్భలంతో బి.జే.పీ.పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ ఆశీస్సులుతో కైకలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా నియమితులైన సత్యవోలు నాగలక్ష్మి ఎన్నిక కావటం పై ముదినేపల్లి మండల బి.జే.పీ.పార్టీ హర్షం వ్యక్తపరచారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయం లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో బి.జే.పీ.పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి ప్రసన్న ముఖ్య అతిథిగా పాల్గొని ఏలూరు జిల్లా లో ని అన్ని విభాగాలలో పార్టీ కి సేవ చేస్తున్న వారిని బి.జే.పీ.పార్టీ కుల,మతాలకు అతీతంగా పార్టీ కోసం సేవచేసే వారిని గుర్తుపెట్టుకొని ఉన్నత అవకాశాలను పార్టీ కార్యకర్తలకు ఇస్తుందన్నారు. ముదినేపల్లి మండలాధ్యక్షురాలు గా 2 పర్యాయాలుగా విశేష సేవలనందిస్తూ,పార్టీ కార్యకర్తలను ఏకతాటి పై నడిపిస్తూన్న సత్యవోలు నాగలక్ష్మి కి కైకలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పదవి రావటం గొప్పవిజయం అన్నారు. విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ బి.జే.పీ. పార్టీ కి ఏం.ఎల్.ఏ. కామినేని శ్రీనివాస్ 2 వసారి పదవిని అలంకరించి నియోజక వర్గంలో బి.జే.పీ.పార్టీ ని ముందుండి నడిపిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియచేసారు. కోటప్రోలు మాట్లాడుతూ ముదినేపల్లి మండలంలో బి.జే.పీ.పార్టీ మరింత బలపడేందుకు ముదినేపల్లి బి.జే.పీ.పార్టీ కార్యకర్తలు విస్తృత కృషి చేస్తున్నారన్నారు. సత్యవోలు నాగలక్ష్మి మాట్లాడుతూ ఏం.ఎల్.ఏ.కామినేని శ్రీనివాస్,కోటప్రోలు కృష్ణ, ముదినేపల్లి మండలంలోని నాతోటి బి.జే.పీ.పార్టీ కుటుంబ సభ్యులు అందరూ తమ సోదరిగా భావించి నాకు పార్టీ పదవిని అప్పగించి నన్ను నడిపిస్తున్న బి.జే.పీ.పార్టీ కుటుంబ సభ్యులు అందరికి నమస్కారాలు తెలియచేస్తున్నానన్నారు.

# దోబి కాలనీకి శరవేగంగా మట్టి రోడ్డు పనులు

**- రోడ్డు నిర్మాణానికి దాతల ఆర్థిక సాయం**

**- పనులు పర్యవేక్షిస్తున్న చాకిరేవు రజక సంఘం అధ్యక్షుడు కేశవ**



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె పట్టణం న్యూ బైపాస్ రోడ్డు నుండి ధోబి కాలనీకి చేరుకోవాలంటే కిలోమీటరు లోనికి వెళ్లాల్సి ఉంది.అయితే ఈ మార్గం రాళ్లగుట్టకు అనుకుని ఉండటం,మలుపులు,ఎగుడు దిగుడులతోపాటు వర్షానికి దారి పొడవున రోడ్డు కోతకు గురైంది.దీంతో ఈ మార్గంలో రాక పోకలు సాగించాలనంటే స్థానిక ప్రజలకు నిత్యం అవస్థలు పడాల్సి వస్తోంది.ఈ నేపథ్యంలో చాకిరేవు రజక సంఘం అధ్యక్షులు,నియోజకవర్గ నాయకుడు కేశవ పర్యవేక్షణలో ఐదురోజులుగా హిటాచి సహాయంతో మలుపులు రోడ్డు అడ్డంకులను తొలగించే పనులు దాతలు సహకారంతో చేపట్టాడు.ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అడ్డంకిగా మారిన పెద్దపెద్ద బండరాళ్లను తొలగించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ప్రజలకు మట్టి రోడ్డును అందుబాటులోకి తీసుకు రావడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నాడు.2010 సంవత్సరంలో రజకులకు అప్పటి ప్రభుత్వం ఇంటి నివేశ స్థలాలు,పక్కాగృహాలు మంజూరు చేసింది.అయితే ఈ కాలనీకి సరైన దారి లేక పోవడంతో నివాసాలు ఉండటానికి రజకులు ఆసక్తిని చూపలేదు.అయితే తదనంతరం ఒక్కొక్కరుగా రజకులు కాలనీకి వచ్చి ఇండ్ల నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్నారు.మరికొన్ని ఇంటి నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయాయి.గత ప్రభుత్వంలో రోడ్డు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా నాలుగేళ్ళ క్రితం ఆయన స్పందించి రెవెన్యూ అధికారుల ద్వారా కాలనీకి వెళ్లడానికి రోడ్డుకు స్థలం కేటాయించి మార్కింగ్ ఇవ్వడం జరిగింది.దీంతో నాలుగేళ్ళ క్రితం మూడు లక్షల రూపాయలు స్థానిక ప్రజలు దాతలు ఖర్చు చేసి తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణం చేసుకున్నారు.అయితే ఈ మార్గం రాకపోకలు సవ్యంగా సవ్యంగా లేకపోవడంతో తిరిగి ఆ మార్గానికి అడ్డంకిగా ఉన్న బండ రాళ్లను తొలగించి దారిపొడవునా సమస్య లేకుండా వాహనాలు వచ్చి పోవడానికి వీలుగా రోడ్డును ఏర్పాటు చేసుకోవడానికి మరోసారి గట్టి ప్రయత్నం చేపట్టారు.చాలా సంవత్సరాలపాటు రోడ్డు లేకపోవడంతో అవస్థలు పడిన కాలనీ వాసులు కూడ మరమ్మత్తు పనులకు తమవంతు సహాయ,సహకారాలను అందిస్తున్నారు.అలాగే స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కత్తి లక్ష్మన్న కూడ ఈ పనులకు తోర్పాటు ఇవ్వడంతో ఈ మార్గంలో ఉన్న అడ్డంకులను తొలగించే పనులు పురోగతిలో కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా కేశవ మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 50 వేల రూపాయిలకుపైగా ఖర్చు చేయడం జరిగిందని,పనులు పూర్తి చేయడానికి వీలుగా స్థానిక ప్రజలు,దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు.త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణం కోసం స్థానిక దోబి కాలనీ ప్రజలతో కలసి ఎమ్మెల్యే షాజహాన్ బాషాను,జిల్లా కలెక్టరుని కలసి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# రెవెన్యూ సేవల్లో వేగం - పారదర్శకతకు ప్రాధాన్యం

**- ప్రజలలో రెవెన్యూ శాఖపై సంతృప్తి స్థాయిని పెంచాలి**

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచనలు**






మదనపల్లె (ప్రజా సీమ) : రెవెన్యూ సేవల్లో వేగం పారదర్శకతతో పెండింగ్ దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు.మదనపల్లి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో శనివారం రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో వివిధ అంశాలపై సమగ్రంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలలో రెవెన్యూ శాఖపై సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు.పీజీఆర్ఎస్ ద్వారా రెవెన్యూ శాఖకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.2024 జూన్ నుంచి ఇప్పటి వరకు 33,153 సమస్యలు రాగా 27,657 సమస్యలను 83.42 శాతం పరిష్కరించడం జరిగిందన్నారు.బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా మిగిలిన వాటిని కూడా త్వరగా పరిష్కరించాలని సూచించారు.ప్రజలు పెట్టిన ప్రతి అభ్యర్థనను ప్రాధాన్యంగా తీసుకొని ఆలస్యం లేకుండా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు.పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి,వాటిని తక్షణమే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ క్లినిక్స్ నిర్వహణపై కూడా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా అన్ని డివిజన్లో 756 దరఖాస్తులు అందగా 339ని నాణ్యతగా పరిష్కరించడం జరిగిందన్నారు.మిగిలిన వాటిని కూడా మార్గదర్శకాలు అనుసరించి వేగంగా పరిష్కరించాలని సూచించారు.గ్రామస్థాయిలో ప్రజలకు చేరువగా సమస్యలు పరిష్కరించే వేదికగా రెవెన్యూ క్లినిక్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని,అక్కడే ఎక్కువ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో 22ఎ చుక్కల భూముల సమస్యల పరిష్కారం కీలక అంశమని పేర్కొంటూ పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి,చట్టపరమైన విధానాల్లో స్పష్టతతో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.మ్యూటేషన్ ప్రక్రియలను పారదర్శకంగా,వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.భూమి యాజమాన్య మార్పులకు సంబంధించి ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు.అలాగే రీ-సర్వే పనులను కచ్చితత్వంతో,నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఇతర రెవెన్యూ అంశాలపైనా సమగ్రంగా సమీక్షించి,ప్రతి స్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.కోర్టు కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేయాలన్నారు.ఇందులో ఏదైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.అలాగే జీరో ఖాతాలు,హౌసింగ్ ఫర్ ఆల్,భూ సేకరణ,ఈ ఆఫీస్ ఫైల్స్ నిర్వహణ తదితరాలపై తీసుకోవాల్సిన చర్యలలో పలు సూచనలు జారీ చేశారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ,సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి,ఆర్డీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగలా మిట్స్ 28వ వార్షికోత్సవ వేడుకలు

**- హాజరైన అతిరథ మహారథులు,ప్రముఖులు - ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**








కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు శనివారం 28వ వార్షిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సందీప్ బడద్ 2025 (యుపిఎస్సీ) సివిల్ సర్వీసెస్,82వ ఆల్ ఇండియా ర్యాంకర్,శ్రీనివాస్ పి.సి ఫౌండర్ అండ్ సిఈఓ ఇండియా 4ఐఏఎస్ అకాడమీ మరియు ప్రశాంత్ శ్రీనివాస్,కో-ఫౌండర్ అండ్ డైరెక్టర్,బెంగళూరు,కర్ణాటక పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ ఎన్.ద్వారకనాథ్,వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్,రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మరియు ముఖ్య అతిథులు సందీప్ బడద్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ బడద్ మాట్లాడుతూ విద్యార్థి దశలో తన అనుభవాలను పంచుకుంటూ విజయం ఒక్క రోజులో రాదని,నిరంతర కృషి,క్రమశిక్షణ,స్పష్టమైన లక్ష్యం ఉంటేనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ చదువు కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా సమస్యలను విశ్లేషించే సామర్థ్యాన్ని పెంచే ఒక సాధనమన్నారు. ఈ నైపుణ్యాలు సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నతస్థాయి పోటీ పరీక్షల్లో ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు కాలేజీ జీవితాన్ని ఆస్వాదించడంతోపాటు ప్రతిరోజూ కొంత సమయం తమ లక్ష్యాల కోసం కేటాయించాలని,ముఖ్యంగా పత్రికలు చదవడం,ప్రస్తుత అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం,సమాజ సమస్యలపై స్పందన కలిగి ఉండడం చాలా అవసరమని సూచించారు. ఆనందంతో పాటు భవిష్యత్తుపై బాధ్యతతో కూడిన ఆలోచన అవసరమని,పట్టభద్రులైన వెంటనే వ్యక్తిగత మరియు కుటుంబ బాధ్యతలు వస్తాయని గుర్తుచేశారు. అందువల్ల కాలేజీ జీవితం ఆస్వాదిస్తూ తమ కలలను సాధించడానికి సమయాన్ని కేటాయించాలన్నారు. అలాగే లక్ష్యాన్ని నిర్ణయించుకుని దాన్ని సాధించడానికి కృషి చేస్తే తప్పకుండా విజయం సాధించి తల్లిదండ్రులకు గర్వకారణమవుతారని తెలిపారు. యువతే దేశ భవిష్యత్తు అని గుర్తుంచుకొని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్ మాట్లాడుతూ మిట్స్ యూనివర్సిటీ అందించిన నాణ్యమైన విద్య ద్వారా విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థాయిలో ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ గత సంవత్సరంలో యూనివర్సిటీ యొక్క విద్యా విజయాలు,నియామకాలు మరియు పరిశోధన సహకారాలను హైలైట్ చేస్తూ వార్షిక నివేదికను సమర్పించారు. ఆ తరువాత వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు,విద్యార్థి అవార్డులు మరియు గుర్తింపులతో సాయంత్రం ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నియోజక వర్గ బూత్ లెవల్ ఇంచార్జ్-1గా కోటప్రోలుకృష్ణ



ఏప్రిల్ 18(కైకలూరు): నియోజకవర్గం ఏం.ఎల్.ఏ. కామినేని ఆశీస్సుల తో కైకలూరు నియోజక వర్గానికి,నియోజక వర్గ బూత్ లెవెల్-1- ఇంచార్జ్ గా రాష్ట్ర పార్టీ అధ్యక్ష్యులు మాధవన్ ఆదేశాలతో ఏలూరు జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ సూచనలతొ (బి.ఎల్.ఏ-1)బూత్ లెవెల్-1గా ఓటరు జాబితా పరిరక్షకుడిగా, భారత ఎన్నికల సంఘం (ఈ.సీ.ఐ.) నిబంధనల ప్రకారం, ఓటరు జాబితాలో పారదర్శకతను పెంచేందుకు రాజకీయ పార్టీల భాగస్వామ్యాన్ని నిర్ధారించే కీలక వ్యక్తి బూత్ లెవల్ నియోజక వర్గ ఇంచార్జ్ విధులను నిర్వహించటానికి, కైకలూరు నియోజకవర్గంలో, బి.జే.పీ.పార్టీ ఏం.ఎల్.ఏ.కామినేని శ్రీనివాస్ ఆదేశాల ప్రకారంగా బి.జే.పీ.పార్టీ రాష్ట్ర కార్యాలయం లో బి.జే.పీ.పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి ప్రసన్న చేతుల మీదుగా కైకలూరు నియోజక వర్గానికి బూత్ లెవెల్ యెజెంట్-1 గా నియామక పత్రాన్ని అందుకొన్నారు. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజక వర్గంలో నాలుగు మండలాల్లో నూ ఓటర్లు నమోదును చేయించాలని తప్పొప్పులు ఉన్నయెడల వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించాలని, ఈకార్యచరణ ప్రణాళికని 30 రోజుల లక్ష్యంగా నిర్వహించాలని,అందులో భాగంగా ?మొదటి 3 రోజులు: గ్రామ స్తాయి బి.ఎల్.ఏ.లు ఓటరు జాబితా సమగ్ర పఠనం చెయ్యాలని ?తదుపరి 15 రోజులు: ఇంటింటి సందర్శన చెయ్యాలని, మరియు ఓటర్ల ధృవీకరణ పత్రాలు పరిశీలించాలని, ?మిగిలిన రోజులలొ అభ్యంతరాల పరిష్కారం మరియు ఫారమ్-6, 7, 8 లపై పర్యవేక్షణ చెయ్యాలని, మన ఓటు - మన హక్కు! ఓటరు జాబితాలోని సవరణ లపై మండల బి.ఎల్.ఏ.లు వారి,వారి మండలాలలో గ్రామ బి.ఎల్.ఓ.లు విధిగా పత్రాలు నిర్వహించేలాచూసి, తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు అందరిని కలుపుకొంటూ బి.జే.పీ.పార్టీ ఆదేశాల ప్రకారం క్రమశిక్షణతొ పూర్తి చెయ్యాలని, కోటప్రోలు కృష్ణకి సూచించారు

# 10 నెలల బాలుడు కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు





ఏప్రిల్ 18:కృష్ణా జిల్లా పరిధిలోని పెనమలూరులో చోటుచేసుకున్న 10 నెలల బాలుడు కిడ్నాప్ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రెస్ మీట్‌లో వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన ప్రకారం, కిడ్నాప్‌కు గురైన బాలుడిని కేవలం 24 గంటల్లోనే సురక్షితంగా రక్షించి తల్లికి అప్పగించామని తెలిపారు. ఈ కేసును ఛేదించేందుకు జిల్లా వ్యాప్తంగా ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సమన్వయంతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని యూసీ టీ స్టాల్ వద్ద బిక్షాటన చేస్తున్న మాదాసు సుమమ్మను ఇద్దరు వ్యక్తులు, ముగ్గురు మహిళలు పాత బట్టలు ఇస్తామంటూ నమ్మించి ఆటోలో తీసుకెళ్లారు. అనంతరం కంకిపాడు ఫ్లైఓవర్ సమీపంలో ఆమె వద్ద ఉన్న 10 నెలల బాలుడిని అపహరించారు. ఈ కేసు విచారణలో గన్నవరం డీఎస్పీ ధర్మేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటైన బృందాలు సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఈ కేసులో గంజాల వెంకట శ్రీనివాసరావు, షేక్ రెహనా, కొమిర కాళీ నిందితులుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఎస్పీ నగదు రివార్డు అందించారు. పోలీసుల సమయోచిత చర్యలతో బాలుడు సురక్షితంగా తిరిగి తల్లి ఒడికి చేర్చారు.

# గుడివాడలో రూ.48 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి

**-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము -డ్రైనేజీల అభివృద్ధిపై ఎమ్మెల్యే రాము సమీక్ష**



గుడివాడ, ఏప్రిల్ 18:ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ నిధులు 48 కోట్ల రూపాయలతో గుడివాడ పట్టణ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఇది గుడివాడ పట్టణానికి చాలా కీలకమైన ప్రాజెక్ట్ అని ఆయన అన్నారు. గుడివాడ పట్టణ వ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధిపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టి పెట్టారు. 36 వార్డుల పరిధిలో డ్రైనేజీల అభివృద్ధికి అధికారుల రూపొందించిన జాబితాను ఎమ్మెల్యే రాము పరిశీలించారు. ఈ సందర్భంగా సిస్ట్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, మున్సిపల్ అధికారులతో పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం ఆయన సమీక్షించారు. గుడివాడ పట్టణ వ్యాప్తంగా 51 స్లం ప్రాంతాలను గుర్తించామని 155 కిలోమీటర్ల పరిధిలో డ్రైనేజీల అభివృద్ధి చేయాల్సి వస్తుందని చెప్తూ 48 కోట్లతో రూపొందించిన అంచనాల నివేదికలను అధికారులు ఎమ్మెల్యే రాముకు చూపించారు. అసలు డ్రైనేజీ వ్యవస్థ లేని ప్రాంతాల్లో, అవుట్ ఫాల్ కూడా ఉండేలా నూతన డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలను అభివృద్ధి చేయాలని అవసరమైతే అదనపు నిధులు తీసుకువస్తానని ఎమ్మెల్యే అధికారులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెందాలనీ, ఎక్కడా కచ్చా డ్రైన్లు ఉండకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రతి వీధిలో, ప్రతి కాలనీలో పక్కా డ్రైనేజీ వ్యవస్థ ఉండాలనీ, వర్షం వస్తే రోడ్ల మీద నీళ్లు నిలబడే పరిస్థితి ఇక ఉండకూడదన్నారు. ముఖ్యంగా డ్రైనేజీల అవుట్‌ఫ్లో పై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని ,ఎన్ని డ్రైన్లు కట్టినా, నీరు బయటకు వెళ్లే మార్గం సరిగా లేకపోతే ప్రయోజనం ఉండదనీ,అవుట్‌ఫ్లో ఛానల్స్ అన్నీ క్లియర్‌గా ఉండేలా అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చినట్టు చెప్పారు. గుడివాడ ప్రజల చిరకాల కోరికల్లో ఒకటైన ఈ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు.

పట్టణ రూపురేఖలు మార్చే బాధ్యత అందరిదీ గా భావించాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎం.ఈ ప్రసాద్, ఎక్స్పెక్ట్ టీం సిస్ట్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాత్రగడ్డ రవికుమార్,పట్టణ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, సీనియర్ టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, మాజీ కౌన్సిలర్ పొట్లూరు కృష్ణారావు,సిస్ట్ కన్సల్టెన్సీ నిపుణుల బృందం, పురపాలక సంఘ ఏ.ఈలు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్ స్కిల్స్ వొకేషనల్ జూనియర్ కాలేజి

**టౌన్ ఫస్ట్ తో పాటు డిస్ట్రిక్ట్ ఫస్ట్ స్టేట్ ర్యాంక్స్ సాధించిన లైఫ్ స్కిల్స్ వొకేషనల్ జూనియర్ కాలేజ్**




జగ్గయ్యపేట: ఏప్రిల్ 18, (ప్రజా సీమ): జగ్గయ్యపేట, ఏప్రిల్ 16:పట్టణం లో వొకేషనల్ విద్య కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన మొదటి కాలేజ్ లైఫ్ స్కిల్స్ వొకేషనల్ జూనియర్ కాలేజ్, మరోసారి తన ప్రతిభను నిరూపించింది. కాలేజ్ విద్యార్థులు జూనియర్ మరియు సీనియర్ ఇంటర్ వొకేషనల్ గ్రూపుల్లో అద్భుత ప్రతిభ కనబరిచి టౌన్ ఫస్ట్ తో పాటు కొన్ని గ్రూపుల్లో డిస్ట్రిక్ట్ ఫస్ట్, మరికొన్ని గ్రూపుల్లో స్టేట్ ర్యాంక్స్ సాధించారు. సీనియర్ ఇంటర్ లో ఎంపీఎచ్డబ్ల్యూ(ఎఫ్) 962 / 1000, ఎల్ ఎం డి-- 929 / 1000, ఈ టీ -- 904 / 1000, ఎంఎల్టీ-- 869 / 1000 మార్కులు జూనియర్ ఇంటర్ లో ఎంఎల్టీ-- 488 / 500, ఎల్ ఎం డడీ -- 484 / 500, సిఎస్ సి -- 472 / 500, ఎంపీఎచ్డబ్ల్యూ (ఎఫ్) -- 468 / 500, ఈ టీ -- 453 / 500 తమ విద్యార్థి మార్కులు సాధించారని చైర్మన్ రంగాపురం నరసింహరావు, సెక్రటరీ కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్, ప్రిన్సిపాల్ అధ్యక్షులు తంగేళ్ల వెంకటేశ్వర రాజు, యాజమాన్య ప్రతినిధులు కొత్తమాసు మల్లికార్జునరావు, జుటూరి వెంకటేశ్వర్లు, రంగాపురం నాగేశ్వరరావు, కొల్లా నాగ రమేష్ , పెనుగొండ సతీష్ లు అభినందించారు. వొకేషనల్ విద్యలో నాణ్యతను అందించడం మా లక్ష్యం. టౌన్, డిస్ట్రిక్ట్, స్టేట్ స్థాయిలో మా విద్యార్థులు రాణించడం మాకు ఎంతో గర్వకారణం" అని తెలిపారు.


# సిద్ధాంతాలకు కట్టుబడే మంచి వ్యక్తి శ్రీకాంత్ -గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఏప్రిల్ 18: గుడివాడ పట్టణంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ పుట్టినరోజు కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. నెహ్రూ చౌక్ సెంటర్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మరియు కూటమి నాయకులు పాల్గొని శ్రీకాంత్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి కేక్ కట్ చేసిన శ్రీకాంత్ కు వివిధ రూపాల్లో నాయకులు సత్కరించారు. అభిమానులు ఏర్పాటు చేసిన మొక్కలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం కొత్తపేట మరియు బేతవోలులో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాము పేదలకు, ఆహారాన్ని అందజేశారు. శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు పట్టణంలో పలుచోట్ల వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ సోదరుడు శ్రీకాంత్ కు ముందుగా నా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నానీ చేరుకొని ఆయనను ఆత్మీయ ఆలింగణం చేసుకున్నారు. శ్రీకాంత్ ను నేను గత కొన్నేళ్లుగా చూస్తున్నాననీ,జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి, పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం గుడివాడలో అహర్నిశలు కష్టపడుతున్నారనీ కొనియాడారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎంత కలిసిమెలిసి ఉంటున్నారో అంతకంటే ఎక్కువ శ్రీకాంత్ నేను కలిసి మెలిసి గుడివాడ అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని ఎమ్మెల్యే రాము అన్నారు. భగవంతుని ఆశీస్సులతో శ్రీకాంత్ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. శ్రీకాంత్ పుట్టినరోజు కార్యక్రమాల్లో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రాగడ్డ రవికుమార్,గుడివాడ, రూరల్ మండల టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబయ్య, వాసే మురళి, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి ,లింగం ప్రసాద్ , గుడివాడ జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, కూటమి నాయకులు సాయన రాజేష్ ,చేకూరు జగన్మోహన్రావు,కొదమల గంగాధర్, పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సినిమా న్యూస్




## నెట్‌ఫ్లిక్స్‌తో నిఖిల్ 'స్వయంభు' డీల్... ఇండస్ట్రీలో హాట్ టాపిక్!

టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కార్తికేయ 2 తో పాన్ ఇండియా హీరోగా మారిపోయారు. ఇప్పుడు 'స్వయంభు' అనే భారీ పీరియాడిక్ డ్రామాతో మన ముందుకు వస్తున్నాడు. ఈ సినిమా డిజిటల్ రైట్స్ విషయంలో నెట్‌ఫ్లిక్స్ ఒక మైండ్ బ్లోయింగ్ ఆఫర్ ఇచ్చింది. థియేటర్ కలెక్షన్లను బట్టి ఓటీటీ రేటును నిర్ణయించే ఈ సరికొత్త ఒప్పందం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ డీల్ వల్ల నిర్మాతలకు లాభమా లేక నష్టమా? అసలు ఈ కొత్త ట్రెండ్ వెనుక ఉన్న మర్మమేంటో ఇప్పుడు చూద్దాం.

నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న 'స్వయంభు' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సాధారణంగా ఒక సినిమా రిలీజ్‌కు ముందే ఓటీటీ హక్కులు భారీ ధరలకు అమ్ముడవుతుంటాయి. కానీ, ఈ సినిమా కోసం నెట్‌ఫ్లిక్స్ ఒక వినూత్నమైన ఆఫర్‌ను నిర్మాతలకు ఇచ్చిందట. ఇక ఈ చిత్రం థియేటర్లలో ఎంత 'నెట్ కలెక్షన్' సాధిస్తుందో, అందులో సరిగ్గా 50 శాతం మొత్తాన్ని డిజిటల్ రైట్స్ కింద చెల్లిస్తారట. అంటే బాక్సాఫీస్ వద్ద సినిమా ఎంత పెద్ద హిట్ అయితే, ఓటీటీ సంస్థ నుండి అంత ఎక్కువ సొమ్ము నిర్మాతలకు అందుతుందన్నమాట.

గతంలో హీరో క్రేజ్‌ను బట్టి కళ్లు మూసుకుని కోట్ల రూపాయలు కుమ్మరించిన ఓటీటీ సంస్థలు, ఇప్పుడు రూటు మార్చాయి. భారీ రేట్లకు కొన్న సినిమాలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఆశించిన స్థాయిలో వ్యూస్‌ను రాబట్టలేకపోవడంతో ఓటీటీ దిగ్గజాలు నష్టాల్లో కూరుకుపోయాయి. అందుకే ఇప్పుడు 'పర్ఫార్మెన్స్ క్లాజ్' అనే పద్ధతిని తీసుకొచ్చాయి. ఇక థియేటర్లలో ఏ సినిమాకైతే జనం బ్రహ్మరథం పడతారో, అదే సినిమాకు ఓటీటీలోనూ మంచి ఆదరణ ఉంటుందని నెట్‌ఫ్లిక్స్ గట్టిగా నమ్ముతోంది. అందుకే ఈ 'సగం కలెక్షన్ల' ఆఫర్ తెరపైకి వచ్చింది.

ఈ సరికొత్త ఒప్పందం టాలీవుడ్‌లో ఒక కొత్త ట్రెండ్‌కు దారితీసేలా కనిపిస్తోంది. ఇది నిర్మాతలకు ఒక రకమైన రిస్క్ అయినప్పటికీ, సినిమా కంటెంట్‌పై గట్టి నమ్మకం ఉంటే మాత్రం జాక్‌పాట్ కొట్టినట్లే. ఒకవేళ బాక్సాఫీస్ వద్ద సినిమా 100 కోట్లు వసూలు చేస్తే, ఓటీటీ నుండి అదనంగా మరో 50 కోట్లు వచ్చే అవకాశం ఉంటుంది. ఇక ఈ మోడల్ సక్సెస్ అయితే భవిష్యత్తులో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి సినిమాకు 'థియేట్రికల్ హిట్' అనేది ఓటీటీ బిజినెస్‌ను శాసించే ప్రధాన అంశంగా మారుతుంది. సంయుక్త మీనన్, నభా నటేష్ వంటి ముద్దుగుమ్మలు నటిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే చిత్ర యూనిట్ రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశం ఉంది. కంటెంట్ బాగుంటే ఆడియన్స్ ఎలాగూ ఆదరిస్తారు, తద్వారా ఓటీటీ రేటు కూడా పెరుగుతుందనే ధీమాతో చిత్ర యూనిట్ ఉన్నట్లు తెలుస్తోంది. మరి నిఖిల్ తన 'స్వయంభు'తో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో, నెట్‌ఫ్లిక్స్‌ను ఎంత మేరకు లాభాల్లోకి నెడతాడో వేచి చూడాలి. ఇక మొత్తానికి ఈ డీల్ మాత్రం ఇండస్ట్రీలో ఒక పెద్ద సెన్సేషన్!



## 'పాపం ప్రతాప్' సెట్లో కెళ్లాక రాశి షాక్ అయ్యారట!

హీరోయిన్‌గా ఒక దశలో హాట్ ఫేవరేట్‌గా నిలిచిన నటి రాశి. అందం, అభినయంతో ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుని ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ ఫేవరేట్ అనిపించుకుంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో క్రేజీ స్టార్లతో నటించిన మంచి పాపులారిటీని సొంతం చేసుకున్నారు. ఆ తరువాత అసిస్టెంట్ డైరెక్టర్‌ని వివాహం చేసుకుని సినిమాలకు కొంత కాలం దూరంగా ఉంటూ వస్తున్న రాశి సీరియల్స్‌లోనూ అమ్మ పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. మళ్లీ వెండితెరపై సీనియర్ స్టార్‌గా ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో నటిస్తూ వస్తున్నారు. సినిమాల్లోనూ మళ్లీ నటించడం మొదలు పెట్టిన రాశి తన క్రేజ్‌కు తగ్గ క్యారెక్టర్లని సొంతం చేసుకోలేకపోతున్నారు. తాజాగా తిరువీర్ కథనాయకుడిగా నటించిన -పాపం ప్రతాప్- సినిమాలో హీరో తల్లిగా కనిపించి అలరించారు. అయితే ఈ క్యారెక్టర్ గురించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించి షాక్ ఇచ్చారు రాశి. ఇప్పుడున్న ఆర్టిస్ట్‌ల పేర్లు నాకు తెలియదు. ఆర్టిస్ట్‌ని చూస్తే గుర్తు పడతా. ఇందులో నటించిన అజయ్ ఘోష్ రంగస్థల నటులు. అయితే ఆయన పేరు నాకు తెలియదు. మనిషి చూస్తే గుర్తు పడతాను.

దర్శకుడు నాకు కథ చెప్పినప్పుడు నా పక్కన అజయ్ గారు నటిస్తున్నారంటే టాల్‌గా ఉండే అజయ్ అనుకున్నాను. ఆయనే అనుకుని నేను ఫిక్స్ అయ్యాను. ఫస్ట్ డే లొకేషన్‌లోకి వెళ్లగానే మేకప్ పూర్తి చేసుకుని జడ వేసుకున్నాను. అజయ్ కొంచెం యంగ్‌గా ఉంటారు. అందుకే నేను జడ వేసుకున్నాను. అయితే క్యారవాన్‌లోని వచ్చిన దర్శకుడు మీరు యంగ్‌గా ఉన్నారు అన్నాడు. నా అసిస్టెంట్ -ఆమె హీరోయినే కదా- అన్నాడు. అంటే మీరు మదర్‌లా కనిపించట్లేదని చెప్పాడు డైరెక్టర్. అయితే నేను ఇప్పుడు ఏం చేయాలో చెప్పండి అన్నాను. వెనకాల జడ కాకుండా ముడి వేసుకోండి అన్నాడు. ఓకే అని అలాగే వేసుకున్నాను. సెట్‌లోకి వెళ్లి నేను అజయ్‌ని వెతుకుతున్నాను. అయితే అక్కడ ఓ చైర్‌లో అజయ్ ఘోష్ గారు కూర్చుని ఉన్నారు. ఆయనని చూసి ఓకే ఈయన మా మామయ్యగారి క్యారెక్టరా? ఏంటీ అనుకున్నాను. ఇంతలో ఒకమ్మాయి వచ్చి ఏంటమ్మా వెతుకుతున్నారు? అని అడిగింది.

అదే అజయ్ గారు ఎక్కడా అని వెతుకుతున్నాను అన్నాను. ఆయనే కదా మేడం అజయ్ ఘోష్ అని తను చూపించింది. ఆయనే అని తెలిసి షాక్ అయ్యాను. ఇదేంటి అని డైరెక్టర్‌ని అడిగితే అప్పట్లో చిన్న వయసులోనే పెళ్లిళ్లు జరుగుతుంటాయి కదా? అన్నారు.

అజయ్ ఘోష్ గారు ఫెంటాస్టిక్ ఆర్టిస్ట్. ఆయనతో ఫస్ట్ టైమ్ వర్క్ చేశాను. ఆయన సింగిల్ టేక్ ఆర్టిస్ట్. అది స్టేజ్ ఫెర్ఫార్మర్స్‌కే ఉంటుంది.

హిలేరియస్ కామెడీని అన్ ద స్పాట్ ఇంప్రూవ్ చేసి చేశారు. ఏ విషయంలోనూ కాంప్రమైజ్ కారు ఆయన- అంటూ అజయ్ ఘోష్ గురించి చెప్పుకొచ్చారు.

## శ్రుతిహాసన్ కి పెళ్లి సంబంధాలు చూస్తున్నారా?

శ్రుతి హాసన్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో తాను మల్టీట్యాలెంటెడ్ బ్యూటీ అని కెరీర్ ఆరంభంలోనే చాటి చెప్పింది. లెజెండ్ కమల్ హాసన్ వారసురాలిగా చిత్ర పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అంచలంచెలుగా ఎదిగింది. సౌత్ సహా బాలీవుడ్ లోనూ అనతి కాలంలోనే సినిమాలు చేసి అన్ని పరిశ్రమల్లోనూ తనదైన ముద్ర వేసింది. వ్యక్తిగత జీవితంలోనే శ్రుతిహాసన్ ప్రేమాయణాలు నడపడంలోనూ తక్కువేం కాదని ప్రూవ్ చేసింది. తొలుత విదేశీయుడు మైఖెల్ కోర్సలేతో కొన్నాళ్ల పాటు డేటింగ్ చేసింది. అతడినే పెళ్లాడాలనుకుంది. ఈ క్రమంలో మైఖెల్ ను డాడ్ కు సైతం పరిచయం చేసింది. కానీ ఎందుకనో ఆ బంధం పెళ్లి వరకూ దారి తీయలేదు. అటుపై కొంత గ్యాప్ తీసుకుని ముంబైకి చెందిన శంతను హాజారికాతోనూ డేటింగ్ చేసింది. తొలి వైఫల్యం నేపథ్యంలో శంతను పెళ్లాడుతుందని అంతా భావించారు. కానీ ఈ బంధం కూడా మధ్యలోనే వీగిపోయింది. అప్పటి నుంచి అమ్మడు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉంటూ వృత్తిగత జీవితంపైనే దృష్టి పెట్టింది. సినిమాలు తప్ప మరో ఆలోచన లేకుండా పని చేస్తోంది. ఈ నేపథ్యంలో శ్రుతి హాసన్ గురించి ఓ వార్త కోలీవుడ్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కమల్ హాసన్ తన గారాల పట్టి కోసం సరైన వరుడిని వెతికే పనిలో పడ్డారని వార్తలొస్తున్నాయి. ఇప్పటికే కొన్ని సంబంధాలు చూసారని ప్రచారం జరుగుతోంది. సాధారణంగా వ్యక్తిగత విషయాలపై చాలా స్పష్టంగా ఉండే కమల్ కూతురి భవిష్యత్తు గురించి ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. శ్రుతి హాసన్‌కు ఇప్పటికే 40 ఏళ్లు నిండాయి. పెళ్లి విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా కమల్ బలమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కమల్ హాసన్ తన మిత్రులు, బంధువుల ద్వారా మంచి సంబంధాలను అన్వేషి స్తున్నారుట. బయట కుర్రాడు కంటే? తెలిసిన కుర్రాడైతే బాగుంటుందనే క్రమంలోనే కమల్ తెలిసిన వాళ్ల ద్వారా పెళ్లి కొడుకును వెతుకుతున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత జీవితంలో కూడా కమల్ హాసన్ చాలా సవాళ్లు ఎదుర్కొ న్నారు. వివాహం అనే జీవితంలో కమల్ చాలా కుదుపులకు లొనయ్యారు. మొదటి భార్యతో విడాకులు ..ఆ తర్వాత నటి గౌతమ్ తో రిలేషన్ షిప్ వీగిపోవడం తెలిసిందే.





## కొడుకులతో కాలక్షేపం.. నయనతార పిల్లల్ని చూసారా?



లేడీ సూపర్ స్టార్ నయనతార వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా తన భర్త విగ్నేష్ శివన్, పిల్లలు ఉయిర్ మరియు ఉలగమ్‌లతో కలిసి దిగిన క్యూట్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలలో నయన్ ముఖంలోని చిరునవ్వు, ఆ ఫ్యామిలీ బాండింగ్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట ట్రెండింగ్‌లో ఉన్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా ఫ్యామిలీకి టైమ్ ఇవ్వడంలో తను ముందుంటానని నయన్ మరోసారి నిరూపించింది. ఆ విశేషాలు చూద్దాం.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో నయనతార, విగ్నేష్ శివన్ జంటకు ఒక ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంది. దాదాపు ఏడేళ్ల పాటు పీకల్లోతు ప్రేమలో మునిగి తేలిన ఈ జోడీ, 2022 జూన్‌లో పెళ్లి పీటలెక్కిన సంగతి తెలిసిందే. పెళ్లయిన తర్వాత కూడా వీరిద్దరూ కెరీర్ మరియు పర్సనల్ లైఫ్‌ను ఎంతో అద్భుతంగా బ్యాలెన్స్ చేస్తున్నారు. ఇక తాజాగా బయటకు వచ్చిన ఫోటోలలో ఈ జంట మధ్య ఉన్న అన్యోన్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకరికొకరు తోడుగా ఉంటూ, ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్న ఈ క్యూట్ కపుల్‌ను చూసి నెటిజన్లు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నయనతారకు తన కవల పిల్లలు ఉయిర్ మరియు ఉలగమ్ అంటే ప్రాణం. వారి పేర్లలోనే ప్రపంచాన్ని చూసుకునే నయన్, షూటింగ్స్ నుండి ఏమాత్రం విరామం దొరికినా పిల్లలతోనే గడుపుతుంది. ప్రస్తుతం ఈ బుజ్జిగాళ్లకు రెండేళ్లు నిండాయి. తాజా ఫోటో షూట్‌లో పిల్లలతో కలిసి ఆడుకుంటూ నయన్ ఇచ్చిన ఫోజులు నెటిజన్ల మనసు గెలుచుకుంటున్నాయి. తన పిల్లల అల్లరిని, వారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకునే నయనతార, ఒక బాధ్యతగల తల్లిగా అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఇక ఆ ఫోటోల్లోని నయన్ స్మైల్ చూస్తుంటే ఆమె ఎంత సంతోషంగా ఉందో అర్థమవుతోంది.

కెరీర్ విషయానికొస్తే, నయనతార చేతిలో ఇప్పుడు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్‌తో కలిసి నటిస్తున్న పాన్-ఇండియా మూవీ 'టాక్సిక్' పై భారీ అంచనాలు ఉన్నాయి. దీనితో పాటు 'డియర్ స్టూడెంట్స్', 'మూక్కుత్తి అమ్మన్ 2', 'మన్నాంగట్టి' మరియు బాలకృష్ణ సినిమా 'చీదీఖ111' వంటి క్రేజీ సినిమాలతో 2026-27 లో ఆమె బిజీగా ఉండబోతోంది. ఈ ఏడాది ఇప్పటికే చిరంజీవి సరసన నటించిన 'మన శంకరవర ప్రసాద్' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న నయన్, త్వరలో బాలీవుడ్ ప్రాజెక్టులతోనూ సందడి చేయబోతోంది. నయనతార అంటే కేవలం గ్లామర్ మాత్రమే కాదు, అంకితభావానికి కూడా నిదర్శనం. ఒకవైపు స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూనే, మరోవైపు తన సొంత ప్రపంచమైన కుటుంబాన్ని ఎంతో ప్రేమగా చూసుకుంటోంది. తాజాగా వైరల్ అవుతున్న ఈ ఫ్యామిలీ ఫోటోలు ఆమె అభిమానులకు కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. సినిమాల్లో పవర్ ఫుల్ పాత్రలు పోషించే నయన్, ఇంట్లో మాత్రం చాలా సాదాసీదాగా, తన పిల్లలతో చిన్నపిల్లలా కలిసిపోవడం విశేషం. ఇలాగే మరిన్ని సక్సెస్‌లతో, సంతోషంతో నయన్ తన కెరీర్‌ను కొనసాగించాలని కోరుకుందాం!

# ఆరోగ్యం



### రాత్రి పడుకునే ముందు ఈ పదార్థం తింటే చాలు

# ఇక రేస్ గుర్రమే!

ప్రతి ఒక్కరి వంటగదిలో ఉండే వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చు. అలాంటి ఒక సుగంధ ద్రవ్యమే లవంగం. దీనిని ఆయుర్వేదంలో ఒక అద్భుతమైన మూలకంగా పరిగణిస్తారు. ఈ లవంగం వలన అనేక ప్రయోజనాలు దొరుకుతాయి. శరీరానికి వీటి వల్ల అనేక మేలు జరుగుతుంది. చాలా మంది కూరల్లో ఇవి వస్తే తీసి పడేస్తారు. కానీ వీటిని తినడం వల్ల అనేక వైరల్ వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చు. అయితే ఈ స్టోరీలో లవంగాల వలన ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు దొరుకుతాయి? వీటిని ఏ విధంగా వినియోగించాలి అనేది తెలుసుకుందాం.

**జీర్ణ సమస్యల నుంచి ఉపశమనానికి**

ఎన్నో సంవత్సరాలుగా లవంగాలను ఆయుర్వేదంలో గొప్ప ఔషధంగా వినియోగిస్తున్నారు. లవంగాలను రాత్రి పడుకునే ముందు రెండు లవంగాలు తీసుకుంటే జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందొచ్చట. లవంగాలు తీసుకోవడం వలన జీర్ణక్రియ మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యల బారి నుంచి బయటపడొచ్చు. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం లవంగాలలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చాలా ఉ ంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. అలాగే జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి ఉ పశమనం కలిగిస్తాయి. దగ్గు, జలుబు కారణంగా ఎవరైనా బాధపడితే లవంగాలు తీసుకోవడం వలన భారీగా ఉపయోగం పొందొచ్చని ఆరోగ్య నిపుణులతో పాటు, ఆయుర్వేద నిపుణులు కూడా సూచిస్తున్నారు.

చిగుళ్ల సమస్య పరిష్కారానికి లవంగంలో యూజినాల్ అనే పదార్థం ఉంటుంది. ఇది పంటి నొప్పి, చిగుళ్ల వాపు వంటి సమస్యలను దూరం చేస్తుంది. అందుకే చాలా మంది టూత్ పేస్ట్‌లో లవంగాలు ఉ న్న పేస్ట్‌ను తీసుకోవడానికి ఇష్టపడుతుంటారు. వీటిని తీసుకోవడం వలన దంతాలకు మంచి ఉపయోగాలు కలుగుతాయి.

**నిద్ర మెరుగుపడుతుంది**

లవంగాలను తీసుకోవడం వలన నాడీ వ్యవస్థ ప్రశాంతంగా ఉంటుంది. దీని కారణంగా రక్త ప్రసరణ సరిగ్గా జరగడంతో పాటు నిద్ర కూడా మంచిగా పడుతుంది. దీంతో ఆరోగ్యం కూడా బాగుంటుంది. అందుకే రాత్రుళ్ళు రెండు లవంగాలు వేసుకొని పడుకోవడం వలన నిద్ర మంచిగా పడుతుందని వైద్యులు చెబుతుంటారు.

## బీట్‌రూట్ ఇడ్లీ..



ఇడ్లిలలో చాలా రకాలు ఉటాయి. ప్రతి ఒక్కరికీ ఇవి ఎంతో ఇష్టమైన అల్పాహారం. వీటిని చేసుకోవడం కూడా సులభం. అలాగే సులువుగా అరిగిపోతాయి కూడా. అయితే మీరెప్పుడైనా బీట్‌రూట్ ఇడ్లీలు తిన్నారా? ఇవి అచ్చం గులాబీ పువ్వుల మాదిరిగానే ఉ ంటాయి. వీటిని చేసుకోవడం కూడా చాలా సులభమైన ప్రక్రియ. ఈ స్టోరీలో మేము బీట్‌రూట్ ఇడ్లీ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది తెలుసుకుందాం.

కావలసిన పదార్థాలు: బియ్యం – రెండు కప్పులు మినప్పప్పు – ఒక కప్పు బీట్రూట్ – ఒకటి నెయ్యి – ఒక స్పూన్ ఉప్పు – రుచికి సరిపడా

తయారీ విధానం: ఈ బీట్‌రూట్ ఇడ్లీ తయారు చేయడానికి ముందుగా బియ్యం, మినప్పప్పును విడివిడిగా కడిగి ఆరు గంటల పాటు నానబెట్టుకోవాలి. అలాగే ఒక బీట్‌రూట్ తీసుకొని శుభ్రం చేసుకోవాలి. దానిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకొని, మిక్సీలో వేసుకొని మెత్తగా రుబ్బుకోవాలి. ఇప్పుడు నానబెట్టిన బియ్యం, మినప్పప్పును ఆ గంటల తరువాత మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. రెండింటిని కలిపి ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. బీట్రూట్ పేస్ట్‌ను కూడా ఇందులో కలిపి మిశ్రమాన్ని రాత్రిపూట పులియబెట్టాలి. ఆ తరువాత ఇడ్లీ పాత్రలో ఈ బీట్‌రూట్ పేస్ట్ కలిపిన పిండిని పోసుకొని ఉడికించాలి. ఆ తరువాత ఇడ్లీలను తీసుకొని ఓ ప్లేట్‌లో పెట్టుకుంటే బీట్‌రూట్ ఇడ్లీలు సిద్ధమైనట్లే. వీటిని వేడి వేడిగా కొబ్బరి చట్నీతో లేదా సాంబార్‌తో తినొచ్చు.




### గుడ్డుతో అదిరిపోయే స్వీట్ జన్మలో

## మర్చిపోలేని టేస్ట్,ఎలా చేసుకోవాలో తెలుసా?



చాలా మందికి స్వీట్స్ అంటే చాలా ఇష్టం ఉంటుంది. కానీ కొందరు వాటిని తినలేరు. దానికి ఆరోగ్యపరమైన కారణాలు కావొచ్చు, మరికొందరికి వేరే ఇతర సమస్యలు ఉండొచ్చు. కానీ ప్రతి ఒక్కరికీ స్వీట్స్ తినాలనే కోరిక మాత్రం ఉంటుంది. అలాంటి వ్యక్తులు ఈ ఎగ్ స్వీట్ తినొచ్చు. ఇది చేసుకోవడం కూడా చాలా సులభం. ఈ స్టోరీలో ఎగ్ స్వీట్ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది వివరించాము, తెలుసుకోండి. కావలసిన పదార్థాలు: పాలు – 1 లీటరు గుడ్లు – 6 చక్కెర – 200 గ్రాములు (పొడి చేసుకోవాలి) నెయ్యి – తగినంత బాదం – 100 గ్రాములు కుంకుమపువ్వు – 1 వెనీలా ఎసెన్స్ – ఒక స్పూన్ యాలకుల పొడి – ఒక స్పూన్ తయారీ విధానం: ఈ ఎగ్ స్వీట్ తయారు చేయడానికి ముందుగా ఒక లీటర్ పాలను కోవా మాదిరిగా పాకం వచ్చే వరకు బాగా మరించాలి. పాలు బాగా చిక్కగా తయారైనప్పుడు స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అలాగే నానబెట్టిన బాదం పప్పు, కప్పు పాలు కలిపి మెత్తగా చేసుకోవాలి. ఇప్పుడు మరొక గిన్నె తీసుకొని అందులో గుడ్లు పగలగొట్టి పోసుకోవాలి. దాంట్లోనే పొడి చక్కెర, కోవా, రుబ్బిన బాదం వేసి మిక్స్ చేసుకోవాలి. చివరగా వెన్నెల ఎసెన్స్, కుంకుమపువ్వు లేదా యాలకుల పొడి మిశ్రమాన్ని కూడా యాడ్ చేయాలి. ఇప్పుడు ఒక కడాయిలో నెయ్యి వేసి బాగా వేడి చేసుకోవాలి. ఆ తరువాత ముందుగా అందులో వేసుకొని చిక్కగా అయ్యే వరకు బాగా ఉడికించుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని దానిలో వేసి చిక్కగా అయ్యే వరకు ఉడికించాలి. ఇప్పుడు కడాయిని పొయ్యి మీద వేసి, కొన్ని నిమిషాల పాటు వేడి చేయాలి. దానిలో ఒక రింగ్ ఉంచి, దానిపై ఈ ప్లేట్ ఉంచి, మూత పెట్టి 40 నుండి 45 నిమిషాలు బేక్ చేసుకోవాలి. తరువాత దించి చల్లారిన తరువాత వేరే ప్లేట్ కు మార్చి, ముక్కలుగా కోసి తినవచ్చు.

## మన పూర్వీకుల చికెన్ కూర ఇలానే చేసుకునేవారట అందుకే వారికి రోగాలు రావు

ఇప్పుడైతే చికెన్‌తో రకరకాల వంటకాలు చేసుకుంటున్నారు. కానీ గతంలో కేవలం చికెన్ కూర మాత్రమే చేసుకునే వారు. మన అమ్మమ్మలు, నానమ్మలకు తెలిసింది అదొక్కటే. అది కూడా చాలా రుచికరమైన పద్ధతిలో, ఆరోగ్యవంతంగా ఎలాంటి ఫ్యాన్సీ మెటీరియల్స్ వినియోగించకుండా ఆ కూరను ప్రిపేర్ చేసుకునే వారు. అయితే అదే పద్ధతిలో మళ్ళీ చికెన్ కూర చేసుకోవాలనుకుంటే ఈ స్టోరీని పూర్తిగా చదవండి. ఈ స్టోరీలో పాతకాలంలో చికెన్ కూడా ఎలా వండుకునేవారో వివరించాము చదవండి.

పూర్వీకుల మాదిరిగా చికెన్ కూర వండడానికి కావాల్సిన పదార్థాలు చికెన్ నూనె ధనియాల పొడి దంచి పెట్టుకున్న గరం మసాలా నూరిన కారం పసుపు దాల్చిన చెక్క ఆవాలు లవంగాలు

పూర్వీకుల మాదిరిగా చికెన్ కూడా వండుకునే విధానం మన పూర్వీకుల మాదిరిగా చికెన్ కర్రీ తయారు చేసుకోవడం చాలా సులభం. అందుకోసం ముందుగా చికెన్‌ను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆ చికెన్‌ను ఓ గిన్నెలో తీసుకొని అందులో నూరిన కారం, చిటికెడు పసుపు, ధనియాల పొడి గరం మసాలా వేసుకొని మ్యారినేట్ చేసుకోవాలి.

ఆ తరువాత ఆ చికెన్‌ను ఒక పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి.



ఇప్పుడు ఒక మట్టి పాత్ర తీసుకోవాలి. ఆ మట్టి పాత్రలో నూనె పోసుకోవాలి. నూనె వేగాక అందులో దాల్చిన చెక్క, లవంగాలు, ఆవాలు, వేసుకోవాలి. అవి కాస్త వేగాక.. అందులో ముందుగా మ్యారినేట్ చేసి పెట్టుకున్న చికెన్ వేసుకొని మొత్తం కలుపుకోవాలి.

చికెన్ నుంచి నీరు ఊరాక, అందులో చికెన్ వండడానికి సరిపడా నీళ్లు వేసుకొని మూత పెట్టుకోవాలి. చికెన్ బాగా ఉడికాక అందులో రుచికి సరిపడా ఉప్పు వేసుకొని మరో అయిదు నిమిషాల పాటు బాగా ఉడికించుకోవాలి. ఆ తరువాత దానిపై కొత్తిమీర చల్లుకుంటే పూర్వీకుల స్టైల్‌లో చికెన్ కూర సిద్ధమైనట్లే.

## ఆల్ టైం ఫేవరెట్ చికెన్ లాలీపాప్,రెస్టారెంట్ స్టైల్‌లో సింపుల్‌గా ఇలా చేసుకోండి



రెస్టారెంట్‌లకు వెళ్తే కచ్చితంగా ప్రతి ఒక్కరూ మొట్టమొదటిగా అడిగేది చికెన్ లాలీపాప్. ఇది తినడానికి చాలా రుచికరంగా ఉ ంటుంది. కానీ దీనిని చేసుకోవడం మాత్రం ఎవరికీ రాదు. అలాంటి వారికోసమే ఈ స్టోరీ. ఈ కథనంలో మేము రెస్టారెంట్ స్టైల్‌లో చికెన్ లాలీపాప్ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో వివరించాము. ఈ స్టోరీని పూర్తిగా చదివి, మీ ఇంట్లోనే చికెన్ లాలీపాప్‌ను సులభంగా చేసుకోండి. చికెన్ లాలీపాప్ తయారీకి కావాల్సిన పదార్థాలు చికెన్ ముక్కలు (డ్రమ్‌స్టిక్స్ లేదా వింగ్స్) వెల్లుల్లి రెబ్బలు ఇంజు పసుపు కారం పొడి గరం మసాలా కొత్తిమీర ఉప్పు మిరియాల పొడి. సోయా సాస్ వినెగర్ కార్న్ ఫ్లోర్ బ్రెడ్ క్రంబ్స్ వేయించడానికి సరిపడా నూనె.నూనె బాగా వేడైన తరువాత మెరినేట్ చేసిన చికెన్ ముక్కలను ముందుగా బ్యాటర్‌లో ముంచి, ఆ తర్వాత బ్రెడ్ క్రంబ్స్‌లో రోల్ చేసి, వేడి నూనెలో వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించండి. ఆ తరువాత వేడి వేడి లాలీపాప్‌లను టమాటో సాస్ లేదా చిలి సాస్‌తో సర్వ్ చేయండి. అంతే ఎంతో రుచికరమైన రెస్టారెంట్ స్టైల్ చికెన్ లాలీపాప్ సిద్ధమైనట్లే.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma